
సాక్షి
కుమురం భీం

బుధవారం, 27, ఆగస్టు, 2025



'సరిహద్దు'లో కర్ర గణేశులే..
నిర్మల్ జిల్లాలోని సరిహద్దు గ్రామాల్లో వినాయక చవితి ప్రత్యేకంగా జరుపుకొంటారు. ఏటా కర్రతో చేసిన విగ్రహాలు ప్రతిష్ఠించి పూజిస్తున్నారు. 10లో▸



పల్లె కూలీకి 'ఉపాధి'
వలసలు నివారించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. రైతులు వినియోగించుకునేలా వివిధ యూనిట్లకు నిధులు కేటాయిస్తోంది. 11లో▸

గరిష్ఠం/కనిష్ఠం
29.0 /24.7

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

చీఫ్ రెఫరీగా వెంకట రామకృష్ణ



ఆర్‌వీ రామకృష్ణ

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ స్టేట్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ రెఫరీగా రెబ్బెన మండలం గోలేటికి చెందిన రిక్కల వెంకట రామకృష్ణ నియమితులయ్యారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో రామకృష్ణను చీఫ్ రెఫరీగా ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బంగారు స్వామి, వీవీ రమణ మంగళవారం తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీ రామకృష్ణను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు భాస్కర్, సెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం



అభినందిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థినులు శాలిని, నిహారికకు మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆర్థికసాయం అందించారు. ఈ నెల 28 నుంచి 31 వరకు హర్యానా రాష్ట్రంలోని సుభాష్ చంద్రబోస్ స్టేడియంలో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి క్రీడల్లో రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, సభ్యులు తిరుపతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి



మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన(ఆసిఫాబాద్): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి వినాయకుడి విగ్రహాలను పూజించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి డిస్పెన్సరీ వద్ద మంగళవారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. జీఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి ఆధ్వర్యంలో ఏటా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పీవోపీతో తయారు చేసే విగ్రహాల వినియోగం తగ్గించాలని సూచించారు. రసాయనాలతో నీటిలోని జీవజాతులకు హాని కలుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ఏరియా పర్యావరణ అధికారి హరీశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

వాంకిడి: డిగ్రీ విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలని వరంగల్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండలంలోని డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. డిగ్రీ దశలో విద్యార్థులు తీసుకునే నిర్ణయాలపైనే భవిష్యత్ ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు, విద్యావేత్తల సూచనలతో మంచి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. తెలుగు మీడియం నుంచి వచ్చిన వారు ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తేనే పైచదువులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకయ్య, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారంపై ఆశలు..!



దహెగాం మండలం కర్జి కిచెందిన ఎల్కరి సంతోష్ ఈ వానాకాలం సీజన్‌లో నాలుగున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. సాగు ఆశాజనకంగా ఉందనుకున్న సమయంలో గత వారం భారీ వర్షాలు కురిశాయి. ఎర్రవాగు, పెద్దవాగుల్లోకి భారీగా వరద వచ్చి పంట చేలను ముంచెత్తింది. వరదలతో మొత్తం పంట నీట మునిగింది. ప్రస్తుతం వరద తగ్గినా మొక్కలు నల్లబారి వాడిపోయాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టామని, కష్టమంతా వరద పాలైందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. సంతోష్ ఒక్కడే కాదు.. జిల్లాలోని పలు మండలాల్లో రైతులు వరదలతో పంటలు నష్టపోయారు. ప్రభుత్వం నుంచి వరద సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

- పెద్దవాగు, ఎర్రవాగులు ఉప్పొంగి నీట మునిగిన పంటలు
- 6,453 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా
- ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తామని మంత్రి 'జూపల్లి' ప్రకటన
- ఎదురుచూస్తున్న బాధిత రైతులు



దహెగాం మండలం కర్జి శివారులో వరదల్లో మునిగి వాడిపోయిన పత్తి మొక్కలు

దహెగాం(సిర్పూర్): గత వారం కురిసిన వర్షాలు పలు మండలాల్లో రైతుల తీవ్ర నష్టాల పాలు చేశాయి. వరదల ఉధృతికి పంటలు నీట మునిగాయి. రూ.వేలు ఖర్చు చేసి పత్తి మొక్కలను కంటికి రెప్పలా కాపాడుకోగా.. పెద్దవాగు, ఎర్రవాగుల పరీవాహక ప్రాంతాల్లో భారీ వరదకు కొట్టుకుపోయాయి. వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నష్టం అంచనా వేసి, పూర్తి వివరాల సేకరణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చేపట్టారు. ఈ నేపథ్యంలో వారం క్రితం జిల్లాలో పర్యటించిన ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేల చొప్పున చెల్లిస్తామని ప్రకటించారు. దీంతో బాధిత రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

6,453 ఎకరాల్లో నష్టం

భారీ వరదలతో జిల్లాలోని 3,115 మంది రైతులకు చెందిన 6,453 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. పెద్దవాగు, ఎర్రవాగుల పరీవాహక ప్రాంతాలైన ఇట్యాల, కోత్మీర్, బీబ్రా, ఐనం, దహెగాం, ఒడ్డుగూడ, అమరగొండ, గెర్రె, గిరవెల్లి, కర్జి గ్రామాల్లో పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగింది. అలాగే పెంచికల్‌పేట్, రెబ్బెన మండలాల్లో సైతం పంటలు దెబ్బతిన్నాయి. ప్రాణహిత పరీవాహక ప్రాంతాలైన చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, కౌటాల మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. అధికంగా సిర్పూర్(టి) నియోజకవర్గంలోనే పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు.

మంత్రి ప్రకటనతో ఆశలు..

భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు, ఆస్తి నష్టం పరిశీలించేందుకు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో ఈ నెల 20న ఉమ్మడి మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించారు. వరదలతో నష్టపోయిన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందిస్తుందని ప్రకటించారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పూర్తి నష్టం వివరాలు సేకరించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. పూర్తి వివరాల సేకరణ అనంతరం ఎకరానికి రూ.10 వేల చొప్పున మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే ఐదు రోజుల క్రితం ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ సైతం పలు మండలాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పరిహారం మంజూరుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సకాలంలో పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పంట నష్టం వివరాలు (ప్రాథమిక అంచనాల ప్రకారం)

మండలం	రైతులు	ఎకరాలు
చింతలమానెపల్లి	287	695
దహెగాం	987	2,245
కౌటాల	374	932.5
రెబ్బెన	349	638
సిర్పూర్(టి)	154	277
కెరమెరి	73	76
కాగజ్‌నగర్	205	252
పెంచికల్‌పేట్	686	1,338

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది పత్తి పంట మంచిగనే ఉండే. వానలకు వరద వచ్చింది. నాకున్న మూడెకరాల్లో పత్తి పంట కొట్టుకుపోయింది. పెట్టిన పెట్టుబడంతా వరద పాలైంది. ఏం చేయాలో అర్థమైతలేదు. అప్పులు ఎట్ల తీర్చుడో..? ఏటా వరదలకు నష్టపోతున్నం. ప్రభుత్వం మాకు ఎకరానికి రూ.20 వేలు ఇచ్చి ఆదుకోవాలి.

– జునుగరి సత్తన్న, రైతు

సర్వే కొనసాగుతోంది

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో ప్రాథమిక అంచనా ప్రకారం 6,453 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రస్తుతం మండలాల్లో పంట నష్టం సర్వే కొనసాగుతోంది. సర్వే పూర్తయిన తర్వాత పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తాం. క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్రంగా సర్వే చేపట్టాలని మండల వ్యవసాయాధికారులకు సూచించాం.

– శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న సిబ్బంది

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లాలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపడతామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం జూనియర్ అసిస్టెంట్ కార్తీక్‌కు సమ్మె నోటీసు అందించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి), తిర్యాణి, కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లోని ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. 2022 నుంచి ఈపీఎఫ్ పూర్తి వివరాలను అందించాలని, ఈఎస్ఐ, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సెప్టెంబర్ 1 తర్వాత సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. అనంతరం కాగజ్‌నగర్ ఏరియా ఆస్పత్రి ఆవరణలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, కార్మికులు తుకారం, తిరుపతి, మారుతి, దేవీరావు, పరమేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

పశువుల యజమానులకు నోటీసులు

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని పలువురు పశువుల యజమానులకు పంచాయతీ కార్యదర్శి తిరుపతి మంగళవారం నోటీసులు జారీ చేశారు. ప్రధాన రహదారులపై పశువులు తిరగకుండా యజమానులు ఇంటి వద్దే కట్టేసుకోవాలని సూచించారు.

డెంగీ కలవరం!

- ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతితో ఆందోళన
- జిల్లావ్యాప్తంగా ప్రబలుతున్న విష జ్వరాలు
- గ్రామాల్లో జాడలేని ఫాగింగ్



కౌటాల(ఆసిఫాబాద్): జిల్లాలో కురుస్తున్న విస్తారమైన వర్షాలకు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారి దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పల్లె జనం మంచం పడుతున్నారు. జ్వరం, కీళ్ల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు. వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు జ్వరాల బారినపడి ఇంటిబాట పడుతున్నారు. ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తిర్యాణి మండలం పంగిడి మాదర పంచాయతీ పరిధిలోని రాజాగూడ గ్రామానికి చెందిన ఆత్రం సీతారాం– దివ్యజ దంపతుల కుమారుడు ఆత్రం అనురాగ్(12) డెంగీతో సోమవారం రాత్రి మృతి చెందడం కలకలం సృష్టించింది. ఈ నెల 19న అతడికి డెంగీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. వరంగల్ ఎంజీఎంలో చికిత్స అందిస్తుండగానే విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు.

ఈ సీజన్‌లో 11 కేసులు

జిల్లాలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, ఐదు సీహెచ్‌సీలు, రెండు యూపీహెచ్‌సీలతోపాటు 15 పీహెచ్‌సీల్లో వైద్యసేవలు అందిస్తున్నారు. లింగాపూర్, బాబాపూర్ పీహెచ్‌సీల్లో అయుష్ వైద్యులు కూడా ఉన్నారు. పీహెచ్‌సీకి కనీసం ఇద్దరు, ముగ్గురు వైద్యులు ఉండాల్సి ఉండగా ఒక్కరే విధులు నిర్వర్తిస్తుండడంతో మెరుగైన వైద్యం అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ఉండగా, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న గ్రామ పంచాయతీలు 60కిపైగా ఉన్నాయి. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో జిల్లాలోని పలు ప్రాంతాల్లో 11 డెంగీ కేసులు నమోదయ్యాయి. దీంతో డెంగీ జ్వరం పేరు అంటేనే ఆందోళన మొదలైంది. ఆర్బో వైరస్‌తో ఈ జ్వరం సోకుతుంది. పగటిపూట కుట్టే ఎడిస్ ఈజిప్టి (టైగర్ దోమ) దోమతో వ్యాప్తి చెందుతుంది. పరిసరాల్లో నీరు నిల్వ ఉండటం, పారిశుధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెందుతాయి. అనుమానం ఉంటే రోగికి వెంటనే రక్త పరీక్షలు చేయించాలి. తెల్ల రక్త కణాలు తగ్గడం, ప్లేట్‌లెట్స్ తగ్గడం, ఎర్ర రక్తకణాల పరిమాణం పెరగడం తదితర వివరాలు ఎలిసా పరీక్షతో నిర్ధారించవచ్చు.

పెరుగుతున్న వైరల్ జ్వరాలు

కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ డివిజన్ల పరిధిలో రెండు నెలల్లో 600 మందికి పైగా వైరల్ జ్వరాల బారిన పడ్డారు. అలాగే 30 మలేరియా కేసులు, 50కి పైగా డయేరియా, 30కి పైగా టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. అనాధికారికంగా జ్వర బాధితుల సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. సాధారణ ఫ్లూ జ్వరాలతోపాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వాటితో బాధపడుతున్నారు. మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీల్లో సాధారణ రోజుల్లో 70– 80 వరకు ఓపీ ఉంటే ఆగస్టులో 160 వరకు పెరిగింది. జిల్లా ఆస్పత్రిలో రోజుకు 500 ఓపీ ఉండగా ప్రస్తుతం 700లకు పైగా వస్తున్నారు. నిత్యం సుమారు 80 వరకు ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. మరోవైపు జిల్లాలో సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. డెంగీకి ప్రధాన ఆస్పత్రుల్లోనే చికిత్స అందిస్తుండటంతో మారుమూల గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లో ఆర్‌ఎంపీలే జ్వరం నిర్ధారించి చికిత్స అందిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దోమల విజృంభణ

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. వైద్యారోగ్య శాఖ, పంచాయతీ, మున్సిపల్ శాఖల సమన్వయంతో చేపట్టాల్సి పనులు ఆగిపోయాయి. డ్రెయినేజీల్లో పూడిక తీయడం లేదు. మురుగునీరు నిలిచి ఉంటుంది. దోమలు వృద్ధి చెందాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశుభ్రత పాటించాలి



హాస్టల్, గృహాలు, పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత కూలర్లు, టైర్లు, పాత్రలు, డ్రమ్ములు, పూలకుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. జ్వరం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించాలి. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అవగాహన కల్పించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

– సీతారాం, డీఎంహెచ్‌వో

రావయ్యా.. గణపయ్యా

- గణేశ్ ఉత్సవాలకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు
- ముస్తాబవుతున్న మండపాలు
- నేడు వినాయక చవితి



జిల్లా కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద ముస్తాబైన వాణిజ్య గణేశ్ మండపం

ఆసిఫాబాద్/కౌటాల: మరికొన్ని గంటల్లో వాడవాడలా గణపయ్య కొలువుదీరనున్నాడు. పార్వతి తనయుడి ఆగమనం కోసం భక్తులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. బుధవారం వినాయక చవితి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకొనేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. అందమైన సెట్టింగ్‌లు, లైటింగ్‌తో మండపాలు ఆకర్షణీయంగా ముస్తాబవుతున్నాయి. నవరాత్రులకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు కల్పించనున్నారు. 800 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా 1200లకు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని పోలీసు అధికారులు తెలిపారు.

వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు

ఈ ఏడాది సుమారు 1000లకు పైగా గణపతి విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలు, కాలనీలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో వాడవాడలా నవరాత్రోత్సవాలు వైభవంగా సాగనున్నాయి. వారం రోజులుగా నిర్వాహకులు విగ్రహాల బుకింగ్, విద్యుత్ పనులు, లైటింగ్ ఏర్పాట్లు, పోలీసుల నుంచి అనుమతులు పొందడం తదితర పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లోనూ విగ్రహాల తయారీదారులు దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే బుకింగ్ చేసుకున్న వారు ముందస్తుగానే ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను తరలిస్తున్నారు. మరికొందరు కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణాల్లో వినాయకుడి ప్రతిమలు కొనుగోలు చేశారు. పీవోపీ విగ్రహ తయారీ ముడిసరుకు, కెమికల్, రంగుల ధరలు భారీగా పెరగడంతో ప్రతిమల ధరలు కూడా పెంచారు. ఆరు ఫీట్ల ఎత్తు విగ్రహానికి రూ.15 నుంచి 20 వేల వరకు విక్రయిస్తుండగా, 10 ఫీట్ల విగ్రహానికి రూ.30 నుంచి రూ. 40 వేల వరకు ధర ఉంది. మంటపాల వద్ద తొమ్మిది రోజులపాటు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు కాగజ్‌నగర్‌లోని ప్రధాన మార్కెట్లు సందడిగా మారాయి. భక్తులు పూజా సామగ్రి కొనుగోలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ కాంతిలాల్ పాటిల్ జిల్లా కేంద్రంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులతో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించారు. మండల కేంద్రాల్లోనూ పోలీసులు వేడుకల నిర్వహణపై పీస్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తూ.. కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్నారు. విగ్రహాల ఏర్పాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతోపాటు నిమజ్జనం వరకు నిబంధనలపై దిశానిర్దేశం చేశారు.

పత్రాలు, ఫలాలతో పూజలు

వినాయక చవితి పండగ రోజున విఘ్నేశ్వరుడికి 21 రకాల పువ్వులతో పూజిస్తారు. ఔషధ గుణాలు కలిగి ఉండే ఈ ఆకులతో పూజించడం, ఆ తర్వాత వాటిని చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేయడం ద్వారా జలాలు శుభ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. మాచి, పత్రి, గరిక, ఉత్తరేణి, ములక, ఉమ్మెత్త, తులసి, మారెడు, రేగు, మామిడి, గన్నేరు, ధవనం, జాజిమల్లె, తెల్లమద్ది, దేవదారు పత్రం, దానిమ్మతో పాటు పలురకాల పత్రాలతో వినాయకుడికి పూజలు చేస్తారు. ఉండ్రాళ్లు, లడ్డూలు, పాయసం దేవుడికి నైవేద్యంగా సమర్పిస్తారు.

మట్టి విగ్రహాలకు పెరిగిన ప్రాధాన్యం

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన గణపతులతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. నిమజ్జనం తర్వాత కూడా నీటిలో కరగకుండా ఎక్కువ కాలం ఉండటంతో నీటి వనరుల్లో కాలుష్యం పెరుగుతుంది. ఈ నేపథ్యంలో వివిధ సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మట్టి గణపతులు ప్రతిష్ఠించడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గతంలో 335 గ్రామ పంచాయతీలకు ప్రతీ పంచాయతీకి పది చొప్పున అధికారులే మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. సోమవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. అలాగే జిల్లా కేంద్రంలో వాసవీక్లబ్, పద్మశాలి సంఘం, వివిధ స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలి



పెద్దవాగు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: జిల్లా ప్రజలు గణేశ్ నవరాత్రులు ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగు పంప్‌హౌజ్ వద్ద నిమజ్జన స్థలాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశం వద్ద మట్టిని చదును చేయాలని, గుంతలు పూడ్చివేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, రూరల్ ఎస్సై సందీప్ ఉన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కృషి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌టౌన్: విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్, డీఈవో దీపక్ తివారి అన్నారు. సిర్పూర్(టి) మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఖాన్ అకాడమీ తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం, వంట సామగ్రిని పరిశీలించారు. అనంతరం లోనవెల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల వివరాలు పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో ఆస్పత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్, లోనవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు నవత, సిబ్బంది ఉన్నారు.



విద్యార్థితో చదివిస్తున్న అదనపు కలెక్టర్

పూలాజీబాబా జయంతి ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- అధికారులతో సన్నాహక సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

ఆసిఫాబాద్: జైనూర్ మండలం పాట్నాపూర్‌లో ఈ నెల 30న పూలాజీ బాబా జయంతి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి పాట్నాపూర్‌లోని పూలాజీ బాబా సంస్థాన్‌లో జయంతి వేడుకల నిర్వహణపై అధికారులు, నిర్వహణ కమిటీ సభ్యులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంస్థాన్ వద్ద వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ శాఖ అధికారులు రూట్‌మ్యాప్ తయారు చేసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తాగునీటికోసం ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ఉట్నూర్ నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను ఆదేశించారు. జాతరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అందుబాటులో ఉండాలన్నారు. భోజన వసతి వద్ద ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ప్రముఖుల కోసం బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం జయంతి పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో జైనూర్ ఏఎంసీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, సంస్థాన్ అధ్యక్షుడు ఇంగ్లే కేశవరావు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు, డీపీవో భిక్షపతి, డీఎంహెచ్‌వో సీతారాం, మిషన్ భగీరథ ఈఈ సిద్దిఖీ, సీఐ బాలాజీ వరప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా పింఛన్లు పంపిణీ

పారదర్శకంగా పింఛన్లు పంపిణీ చేస్తున్నామని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో అదనపు కలెక్టర్ దీపక్‌తివారితో కలిసి బ్రాంచ్‌పోస్టల్ ఆఫీసర్ల(బీపీఎం)లకు మొబైల్స్ అందించారు. మొబైల్‌లో ప్రత్యేక యాప్‌లో పెన్షన్‌దారులకు సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుందని తెలిపారు. ప్రతినెలా ఐరిష్, వేలిముద్రల ద్వారా పెన్షన్ అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో దత్తారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేకాడుతున్న ముగ్గురి అరెస్ట్

శ్రీరాంపూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంగళవారం సుందరయ్య కాలనీ వద్ద గల నందనవనం వెనకాల చెట్ల పొదల్లో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అక్కడికి వెళ్లి పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.64,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్సెట్టిపేటలో 11మంది..

లక్సెట్టిపేట: మున్సిపాలిటి పరిధిలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం పేకాడుతున్న 11మందిని పట్టుకున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. వారి నుంచి రూ.4,080 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వాహనం ఢీకొని జింకపిల్ల మృతి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 8 గని సమీపంలో రోడ్డు ప్రమాదంలో జింకపిల్ల మృతి చెందింది. మంగళవారం ఉదయం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఉంటుందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఉదయం గని కార్మికులు ప్రమాదాన్ని చూసి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజహర్, బీట్ ఆఫీసర్ సౌజన్య ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి దానిని ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. జింకపిల్ల వయస్సు మూడేళ్లు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అడవి నుంచి దారి తప్పి ఇటుగా వచ్చి ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో సాత్‌పూల్ వంతెనపై ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. భైంసా డిపోకు చెందిన బస్సు మంగళవారం సాయంత్రం ధర్మాబాద్ వైపు నుంచి భైంసాకు వస్తుండగా, భైంసా వైపు నుంచి వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో ధ్వంసం కాగా, డ్రైవర్ సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఏరియాస్పత్రికి తరలించగా, క్షతగాత్రున్ని డీఎం హరిప్రసాద్ పరామర్శించారు. ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

'సరిహద్దు'లో కర్ర గణేశులే..

- సమాజ హితమే వీరి అభిమతం
- ప్రత్యేకత చాటుకుంటున్న 'పాలజ్'
- నేటి నుంచి నవరాత్రోత్సవాలు


మాటేగాంలో వెలసిన కొరడి గణపతి


పాలజ్‌లోని కర్ర గణేశుడు

భైంసా/తానూరు: గణేశ్ నవరాత్రోవాలను నిర్మల్ జిల్లాలోని తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు వినూత్న రీతిలో జరుపుకొంటారు. పీవోపీ, మట్టి విగ్రహాలు ఇక్కడ మచ్చుకైనా కనిపించవు. రంగులు, రసాయనాల వినియోగం అస్సలే ఉండదు. హంగులు, ఆర్భాటాలు లేకుండా సమాజహితమే తమ అభిమతమని ఇక్కడి ప్రజలు పూర్వీకులు చూపిన బాటనే నేటికీ అనుసరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ వంతుగా దోహదం చేస్తున్నారు. కర్రతో చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు.

పాలజ్ గణేశ్ ఫేమస్

తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని ఓ చిన్న మరాఠీ గ్రామం పాలజ్. కుభీర్‌కు పక్కనే మహారాష్ట్రలోని బోకర్ తాలూకాలో ఈ ఊరు ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ గ్రామంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలి జనమంతా మంచం పట్టారు. ఇదే సమయంలో వినాయక చవితి పండుగ వచ్చింది. ఓ వైపు కలరా, ప్లేగు వ్యాధులు, మరోవైపు కరువు పరిస్థితులతో జనం సతమతమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా కర్ర గణపతిని చేయించి ప్రతిష్ఠించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు. నిర్మల్ కొయ్యబొమ్మలు చేసే నకాషీ కళాకారుడైన గుండాజీ వర్మను కలిశారు. నిష్ఠతో గుండాజీ వర్మ చేసిన సుందరమైన కర్ర విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఊరంతా మొక్కితేనే వ్యాధులు దూరమయ్యాయని, కరువు కాటకాలు తొలగిపోయాయని గ్రామపెద్దలు చెబుతారు. అలా 1948 నుంచి కర్ర గణేశుడిని వినాయక ఉత్సవాల్లో కొలవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ఊరి ఆడబిడ్డల ద్వారానే కర్రగణేశుడి గురించి ఇతర గ్రామాలకు తెలిసింది. పూజల అనంతరం నిమజ్జనం రోజున స్థానిక వాగు వద్దకు తీసుకెళ్లి కర్ర గణేశుడికి పూజలు నిర్వహిస్తారు. అక్కడే నీళ్లు చల్లి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. దీనినే నిమజ్జనోత్సవంగా భావిస్తారు. అనంతరం కర్ర విగ్రహాన్ని తిరిగి ఆలయంలోని బీరువాలో భద్రపరుస్తారు.

కలిసికట్టుగా.. లక్షలాదిగా..

తిరుపతి, షిర్డీలో ఉన్నట్లు పాలజ్‌లోనూ భక్తులకు క్యూలైన్లు ఉన్నాయంటే.. ఇక్కడికి వచ్చే భక్తుల సంఖ్య అంచనా వేయొచ్చు. ప్రతీ ఏడాది వినాయక ఉత్సవాల్లో దాదాపు ఆరు లక్షల నుంచి ఏడు లక్షల మంది భక్తులు పాల్గొంటున్నారని అంచనా. లక్షల్లో తరలివచ్చే భక్తులకు గ్రామస్తులే సేవలందిస్తున్నారు. ఆ ఊరంతా కలిసికట్టుగా కర్రగణేశుడి సేవలో పాల్గొంటుండడం ఇక్కడి విశేషం.

మరికొన్ని గ్రామాల్లోనూ..

తానూరు మండలం బోసిలో వరసిద్ధి కర్ర వినాయకుడు, కుభీర్ మండలం కుభీర్, పార్డి, మాలేగాం చిక్లీ, భైంసా మండలం మాటేగాం, లోకేశ్వరం మండలం అబ్దుల్లాపూర్ గ్రామాల్లోనూ కర్ర గణపతులను ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తారు. స్వాతంత్ర్య పోరాటకాలంలో కరువు నేపథ్యంలో గ్రామస్తుల మొక్కులతో ఇలా ఈ ప్రాంతంలో ఊరంతా కలిసి కర్ర గణపతులను ప్రతిష్ఠించడం మొదలైంది.

పాలజ్‌కు ఎలా వెళ్లాలంటే..

హైదరాబాద్ నుంచి వచ్చేవారు నిజామాబాద్, బాసర మీదుగా భైంసా చేరుకుంటే దూరభారం తగ్గుతుంది. నిర్మల్ మీదుగా వచ్చేవాళ్లు కూడా భైంసా మీదుగానే పాలజ్ వెళ్లాల్సి ఉంటుంది. భైంసా నుంచి 23 కిలోమీటర్ల దూరంలో పాలజ్ ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా ఈ గ్రామానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతుంది. ప్రైవేట్ వాహనాలు కూడా అందుబాటులో ఉంటాయి.

గణపయ్యకు 32 రూపాలు



హిందూ పురాణాల ప్రకారం గణపతి సకల దేవతలకు అధిపతి. పూజ ఏదైనా ముందుగా గణపతినే పూజిస్తారు. ప్రతీ శుభకార్యాన్ని వినాయకుడి పూజతోనే ప్రారంభిస్తారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. హిందూ సంప్రదాయాల్లో ఇంటిని నిర్మిస్తే ప్రధాన ద్వారానికి గణపతిని ప్రతిష్ఠిస్తారు. ఉదయం లేవగానే నీటితో కడిగి పూజించి వెళ్తారు. ఇంటి నుంచి వెళ్లే సమయంలోనూ ప్రధాన ద్వారంలో ఉన్న గణపతికి నమస్కరిస్తారు. తిరిగి వస్తూ మళ్లీ గణపతికి నమస్కరించాకే ఇంటిలోకి వెళ్తారు. ఏ ఆలయం నిర్మించినా ముందుగా గణపతి పూజలు చేస్తారు. గణపతి హోమాలు నిర్వహిస్తారు. ఇలా అందరికీ గణాధిపతి అయిన స్వామివారికి ముద్గల పురాణంలో 32 స్వరూపాలను వర్ణించారు. ఈ 32 స్వరూపాల్లో 16 రూపాలు అత్యంత ప్రాశస్త్యమైనవి.

పురాణాల్లో పేర్కొన్న రూపాలు

పురాణాల్లో వినాయకుడికి 32 స్వరూపాలుగా పేర్కొన్నారు. ఇందులో 16 రూపాలు అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. నేటి రోజుల్లో కళాకారులు గణపయ్యను అనేక రూపాల్లో మలుస్తున్నారు. ఈ 16 రూపాల్లో ఉన్న గణనాథులకు పూజలు చేస్తే మంచి జరుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల్లో పేర్కొన్నట్లు బాలగణపతి, తరుణగణపతి, ఉచ్ఛిష్టగణపతి, విఘ్నగణపతి, మహాగణపతి, క్షిప్రగణపతి, హేరంబగణపతి, లక్ష్మీగణపతి, భక్తిగణపతి, వీరగణపతి, శక్తిగణపతి, ద్విజగణపతి, సిద్ధగణపతి, నృత్యగణపతి, ఊర్ధ్వగణపతి, విజయగణపతి.. ఇలా 16 ప్రధానమైన రూపాలున్నాయి.

ఆర్జీయూకేటీలో ముగిసిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం


మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసరలోని ఆర్జీయూకేటీలో ఇంజినీరింగ్‌లో అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. వారం రోజులుగా కొనసాగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు విద్య, వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు, నిర్ణయాలు తీసుకోవడం, వ్యక్తిగత అభివృద్ధి వంటి విభిన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ.మురళీదర్శన్, స్టూడెంట్ కోఆర్డినేటర్ మహబూబ్, అసోసియేట్ డీన్‌లు చంద్రశేఖర్, మహేశ్, విఠల్, ఇంజినీరింగ్ విభాగాధిపతులు ఉపేందర్, భావ్‌సింగ్ వినయ్, కోఆర్డినేటర్ తేజస్వి, సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీ సీఈవోల బదిలీ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవోలకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 66మంది సీఈవోలు ఉండగా, 49 మందిని వివిధ మండలాలకు బదిలీ చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మరో 17 సొసైటీల్లో రెగ్యులర్ సీఈవో లేకపోవడంతో వారికి ఎలాంటి బదిలీ జరగలేదు. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ చేసినట్లు జిల్లా సహకారశాఖ అధికారి మోహన్ తెలిపారు.

డెంగీతో విద్యార్థి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
- పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్
- ఏఎన్ఎంను విధుల నుంచి తొలగింపు


ఆత్రం అనురాగ్ (ఫైల్)

తిర్యాణి: డెంగీతో ఓ విద్యార్థి మృతి చెందాడు. తల్లిదండ్రులు, ఆర్‌బీఎస్‌కే వైద్యుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పంగిడిమాదర పంచాయతీ పరిధి రాజాగూడ గ్రామానికి చెందిన ఆత్రం సీతారాం–దివ్యజ దంపతులకు ఇద్దరు కుమారులు. మొదటి కుమారుడు ఆత్రం అనురాగ్ (12) స్థానిక ఆశ్రమ పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాడు. ఈనెల 14న అతడికి జర్వం రావడంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం తల్లిదండ్రులు మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో చేర్పించారు. 15న వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించగా వ్యాధి నిరార్ధణ కాలేదు. అయినప్పటికీ జర్వం తగ్గకపోవడంతో 18న రక్త పరీక్షలు నిర్వహించి తెల్లరక్త కణాలు తగ్గినట్లు గుర్తించారు. 19న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహించి డెంగీగా నిర్ధారించారు. ఈనెల 21న బాలుడి పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీటీడీవో రమాదేవి, ఎంపీడీవో మల్లేశ్ పరామర్శించారు. కాగా, తిర్యాణి సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది వ్యాధి నిర్ధారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి మూడు, నాలుగు రోజులు మామూలు వైద్యం అందించారని తల్లిదండ్రులు ఆరోపించారు. పరిస్థితి విషమించగా మంచిర్యాల ఆస్పత్రికి రిఫర్ చేశారని వాపోయారు. వైద్య సిబ్బంది సరైన చికిత్స అందించి ఉంటే తమ కొడుకు బతికేవాడని ఆవేదన వ్యక్తంజేశారు. కాగా, విద్యార్థికి జర్వం వస్తున్నా ఉన్నతాధికారులకు తెలుపకుండా నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రధానోపాధ్యా యుడు సాగర్‌ను సస్పెండ్ చేసినట్లు డీటీడీవో రమాదేవి తెలిపారు. అలాగే విధులను నిర్లక్ష్యం చేసిన ఏఎన్ఎం సువార్తను విధుల నుంచి తొలగించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాల హెచ్‌ఎంగా సీనియర్ ఉపాధ్యాయుడు తిరుపతికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

నిందితుడి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీలో ఓ వ్యక్తిని బెదిరించి నగదు దొంగిలించిన డీసీ సీటర్ ఖద్దర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగూడకు చెందిన ముత్యాలు ఆ ప్రాంతంలో చేపలు విక్రయిస్తున్నాడు. అదే కాలనీకి చెందిన డీసీ సీటర్ ఖద్దర్ ముత్యాలును బెదిరించి రూ.1,500 దొంగిలించి పరారయ్యా డు. అంతేకాకుండా ముత్యాల పక్కనున్న శ్రీని వాస్‌పై దాడి చేశాడు. దీంతో బాధితుల ఫిర్యా దు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఖద్దర్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కలప పట్టివేత

దండేపల్లి: మండలంలోని నంబాల గోదావరి తీరం వద్ద అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 15 టేకు దుంగలను మంగళవారం తమ సిబ్బంది పట్టుకున్నట్లు తాళ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ.42,329 ఉంటుందని పేర్కొన్నారు. కలపను రేంజ్‌కి తరలించినట్లు తెలిపారు. అటవీ సిబ్బంది ఎఫ్ఎస్‌వో నరేశ్, ఎఫ్‌బీవో నాగరాజుచారి, టైగర్ ట్రాకర్ ప్రశాంత్, బేస్ క్యాంప్ వాచర్ పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డ నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: చోరీలకు పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న తిర్పెల్లిలోని శ్రీనివాస వైన్స్‌లో ఐదుగురు దొంగతనానికి పాల్పడగా అందులో షేక్ బిలాల్, మహ్మద్ షారుఖ్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపా రు. అలాగే ఈనెల 6న సంజయ్‌నగర్ కాలనీకి చెందిన శానం నవీన్‌కుమార్ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన మహారాష్ట్రకు చెందిన మా ర్కులే అనిల్‌ను మంగళవారం అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల బంగారం చోరీ కి పాల్పడగా, నిందితుడి నుంచి అర తులం రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు.

నవోదయకు 6,091 దరఖాస్తులు

- ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు నేటితో పూర్తి
- డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష


నవోదయ విద్యాలయం

కాగజ్‌నగర్ టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం అన్ని వసతులతో పాటు క్రమ శిక్షణతో కూడిన నాణ్యమైన విద్యకు మారుపేరుగా నిలుస్తోంది. 2026–27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు గాను విద్యార్థుల నుంచి ఈ నెల 27 వరకు www. navodaya. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటివరకు 6,091 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,003 మంది బాలికలు, 3,088 మంది బాలుర దరఖాస్తులున్నాయి. అర్హత పరీక్షలో ప్రతిభ ఆధారంగా నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశం కల్పిస్తారు.

దరఖాస్తుల వివరాలు

చెన్నూరు నుంచి 274 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఖానాపూర్ నుంచి 287, మంచిర్యాల నుంచి 510, కాగజ్‌నగర్ నుంచి 631, సిర్పూర్ నుంచి 378, ఆదిలాబాద్ నుంచి 571, బెల్లంపల్లి నుంచి 270, బోథ్ నుంచి 319, నిర్మల్ నుంచి 590, భైంసా నుంచి 664, లక్సెట్టిపేట్ నుంచి 350,మంథని నుంచి 279, ఉట్నూర్ నుంచి 377, ఆసిఫాబాద్ నుంచి 591 వచ్చినట్లు పేర్కొన్నారు.

త్రిభాషా విధానం అమలు

ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో విద్యార్థులు ఐదో తరగతి చదివి ఉండాలి. వరుసగా 3, 4, 5 తరగతులు ఒకే పాఠశాలలో చదివినవారే అర్హులు. విద్యార్థులు మే 1, 2014 నుంచి జూలై 31, 2016 మధ్యలో జన్మించి ఉండాలి. జవహర్ నవోదయ విద్యాలయంలో త్రిభాషా విధానం ప్రాతిపదికన జాతీయ సమైక్యతకు బాటలు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు సోపానంగా నిలుస్తోంది. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాకులు బాలబాలికలకు వేర్వేరుగా డార్మెటరీలు, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌కు క్వార్టర్లు వంటి వసతులున్నాయి. అంతర్గత సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, ఆరోగ్యాన్ని పంచే హరిత సంపద, సుశిక్షితులైన అధ్యాపకులు, స్మార్ట్ క్లాసులు, సైన్స్, మ్యాథ్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, ఆటలకు బాసటగా విశాలమైన స్టేడియం, బాస్కెట్‌బాల్ తదితర మైదానాలు జిమ్, హెల్త్‌సెంటర్‌లతో నవోదయ ప్రత్యేకత చాటుతోంది. ఇక్కడ పుస్తకాలు, దుస్తులు సహా విద్యార్థులకు అన్నీ ఉచితమే. 6, 7 తరగతులకు మాతృబాషలో బోధిస్తారు. 8వ తరగతి నుంచి ఆంగ్లంలో విద్యాబోధన చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



2026–27 విద్యాసంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశానికి డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.


– రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్, కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయం

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు


మాట్లాడుతున్న రీజినల్ కమిషనర్ గోవర్ధన్

రెబ్బెన: జాప్యం లేకుండా సింగరేణి ఉద్యోగులకు సీఎంపీఎఫ్ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్–2 గోవర్ధన్ కంటిపుడి తెలిపారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రయాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎంపీఎఫ్ లావాదేవీలు అన్ని సీకేర్స్ పోర్టర్ ద్వారా మాత్రమే జరుగుతున్నాయని, సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయని పేర్కొన్నారు. ఉద్యోగులు మధ్యవర్తులు లేకుండా సీఎంపీఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని సూచించారు. సీఎంపీఎఫ్ బెనిఫిట్స్‌కు అర్హులు, పెన్షన్, రివైస్డ్ పెన్షన్‌పై ఎలాంటి పెండింగ్‌లు ఉండకుండా చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్, సీఎంపీఎఫ్ దరఖాస్తులు జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతీ ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. ఎస్‌వోటూ జీఎం రాజమల్లు, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ప్రశాంత్, సీఎంపీఎఫ్ ఉద్యోగులు మనోహర్, అనిత, అన్ని విభాగాల సంక్షేమ శాఖ క్లరికల్ సిబ్బంది ఉన్నారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ డబ్బులను వెంటనే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ–3 గనిలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.27వేల కోట్ల బకాయిలుంటే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.42 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. సమయానికి బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు పడుతోందని పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంతో సంస్థ పాలన గాడి తప్పుతోందని తెలిపారు. గుర్తింపు సంఘంగా తాము గెలిచిన తర్వాత కార్మికుల ప్రధాన డిమాండ్లను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరగని స్ట్రక్చరల్ సమావేశాలు నిర్వహించి కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తున్నామని తెలిపారు. కార్మికుల ప్రధాన డిమాండ్ల సాధనకు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తూ సాధనకు కృషి చేస్తున్నామని చెప్పారు. కంపెనీ వార్షిక లాభాలను ప్రకటించి అందులో నుంచి 35శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, జీఎం చర్చల కమిటీ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, సంపత్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ సెక్రటరీ మురళీచౌదరి, ఆకుల లచ్చన్న, జాడి రాజకుమార్, కారుకూరి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.